
# విజయలక్ష్మి విజయం

శ్రీనివాసాచార్యులు



ఇప్పటికి పధ్నాలుగు ఇంటర్వ్యూలు పూర్తి చేసింది తను. అయినా పట్టువదలని విక్రమార్కుని చెల్లెలిలా పదిహేనవ ఇంటర్వ్యూకి హాజరుకాబోతుంది.

అందుకు కారణం ఉద్యోగం సంపాదించి సంఘంలో పరపతి పెంచుకోవాలన్నా తపన కాదు. ఇంట్లో ఖాళీగా



ఉండటం వల్లన బోర్‌గా అనిపించీ కాదు.ఉద్యోగం తనకు నెసెసరీ. అందుకు కారణం పేదరికం.

తను పురిట్లో ఉండగానే తండ్రి చనిపోయాడు. ఆనాటి నుండి రెక్కలు ముక్కలు చేసుకొని పస్తులుండి తనను పెంచిపోషించి డిగ్రీ వరకు చదివించింది అమ్మ.

మునుపటిలా రెక్కలు ముక్కలు చేసుకోవడానికి ఇప్పుడామె శరీరం సహకరించడం లేదు. వృద్ధాప్యం దగ్గర పడుతూన్నకొద్దీ పనిచేయగల శక్తి ఆమెలో సన్నగిల్లుతోంది.

అయినా ఎన్నాళ్ళని తన తల్లి సంపాదన మీద బతకాలి ఇరవై ఒకటి నిండి ఇరవై రెండులా అడుగుపెట్టింది.

డిగ్రీతో బాటు టైపులోయర్, హయ్యర్ పూర్తిచేసిన

తను ఏదైనా చిన్న ఉద్యోగంలో చేరి ఇన్నాళ్ళూ తనకు వెట్టిచాకిరీ చేసిన తల్లి రుణం కొంతైనా తీర్చుకోవద్దా- అందుకే పధ్నాలుగు ఇంటర్వ్యూలలో ఫెయిలైన పట్టుదలతో పదిహేనవ ఇంటర్వ్యూకి వెళ్తోంది.

"ఈసారి నీకు తప్పకుండా ఉద్యోగం వస్తుంది లక్ష్మీ! వెళ్తూ వెళ్తూ వెంకటేశ్వర స్వామి గుడికెళ్ళి దండం పెట్టుకొని వెళ్ళమ్మా!!" అమ్మ కళ్ళల్లో ఆశల మెరుపు.

ఆమె పిచ్చి గాని ఇంతకు ముందు వెళ్ళిన పధ్నాలుగు ఇంటర్వ్యూలకి మాత్రం గుడికి వెళ్ళి దండం పెట్టుకోలేదా!

పేదవాళ్ళ బ్రతుకులలో కష్టాల్ని నింపి ఆ భగవంతుడు తమాషా చూస్తున్నాడా!

లేక ఈ లంచాల లోకంలో తాను కూడా అమ్ముడైపోయి ఏమీ చేయలేక చేతులెత్తేశాడా!!

"మే ఐ కమిన్ సార్!" ఫుల్‌స్టాప్ లేని తన ఆలోచనలకు అప్పటికి కామాపెట్టి ఇంటర్వ్యూ గదిలోకి ఎంటరవుతూ అంది విజయలక్ష్మి.

పసిడి రంగుమేని ఛాయతో, చక్కని అవయవ సంపదతో, కట్టింది కాటన్ చీరే అయినా డిగ్నిఫైడ్‌గా కనబడుతున్న ఆమెను చూసి క్షణకాలం లోకాన్ని మరచి అంతలోనే తేరుకుని "ప్లీజ్ కమ్ అండ్ టేక్ యువర్ సీట్' ముఖమంతా నవ్వు పులుముకుని అన్నాడు ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య.

ఇప్పటికి ఆమె పూర్తి చేసిన పధ్నాలుగు ఇంటర్వ్యూల అనుభవంతో, ఇంటర్వ్యూ సమయంలో ఫియర్, టెన్షన్ లేకుండా ఎలా బిహేవ్ చేయాలో ఆమెకు తెలుసు.

కానీ ఈ ఉద్యోగం అయినా తనకు వస్తుందేమోనన్న ఒకే ఒక ఆశ ఆమెని వాటికి దూరంగా ఉంచలేకపోయింది.

వినయంతో తన సర్టిఫికెట్స్‌ని ఆదిత్యకి అందించింది విజయలక్ష్మి.

గదిలోకి వచ్చిన దగ్గర నుండి రెప్పవేయ కుండా ఆమెనే చూస్తూ, ఆమె అందించిన సర్టిఫికెట్స్‌ని అందుకోకుండానే "నీలాంటి అందమైన ఆడపిల్లకి ఉద్యోగం ఇవ్వడానికి సర్టిఫికెట్లు చూడాల్సిన అవసరం లేదు మిస్. వెంటనే ఉద్యోగం ఇవ్వొచ్చు. కానీ మా కంపెనీ రూల్స్‌ని కాదని నీకీ ఉద్యోగం ఇవ్వలేను. సో ఈ జాబ్ నీకు రావాలంటే ఇరవై వేలు కట్టాలి." ముఖం మీ్మద కొట్టినట్టు సూటిగా చెప్పాడు ఆదిత్య.

"కానీ సర్..." ఆమె కళ్ళల్లో తిరుగుతుండగా ఇంకా ఏదో అనబోయేంతలో ఆదిత్యే అన్నాడు."

' నా దగ్గర అంత డబ్బులేదు. మేము చాలా పేదవాళ్ళం, నాయందు దయ చూపండి' అంటావ్. అంతేగా అయామ్ సారీ! అని- కుర్చీలో నుండి లేచి ముందుకు వంగి "బట్ నీకీ ఉద్యోగం రావాలంటే ఒకే ఒక మార్గం ఉంది" జారిన ఆమె పైటవైపు గుటకలేస్తూ చెప్పాడు.

"ఏమిటో చెప్పండి సర్' కళ్ళల్లో ఆశ కదలాడుతుండగా అడిగింది విజయలక్ష్మి.

"ఒక రాత్రి నువ్వు నాతో గడిపితే ఇరవై వేలతో పనిలేకుండా పోస్టింగ్ ఆర్డర్స్ నీ చేతిలో ఉంటాయి. కాదంటే ఈ ఉద్యోగం నీకు రాదు" చెప్పాడు ఆదిత్య.

శిలా విగ్రహంలా బిగుసుకుపోయింది విజయ.

ఆమె తేరుకునేలోపు మళ్ళీ ఆదిత్యే అన్నాడు. 'రేపు సాయంత్రానికల్లా ఏ విషయం నాకు చెప్పాలి. ఆలోచించుకో! ఇరవై వేలా? ఒకరాత్రి నాతోపాందా!" ఆదిత్య మాటల్లో బెదిరింపు కమాండింగ్ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆదిత్య మామూలు మనిషికాడు, ఇరవై రెండేళ్ళ వయసులో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టాపొందాడు. పన్నెండు సంవత్సరాలుగా ఈ కంపెనీలో పనిచేస్తూ మూడేళ్ళ నుండి ఎమ్.డి.పదవిలో కొనసాగుతున్న మహామేధావి.

బిజినెస్‌కు సంబంధించిన విషయాల్లో కంప్యూటర్‌లా పనిచేస్తుంది అతని మైండ్. ఎదుటి వ్యక్తితో ఐదు నిముషాలు మాట్లాడితే అతడి జాతకమంతా చెప్పేయగల సూపర్ ఇంటెలిజెంట్ మైండ్ అతనిది.

తనకున్న తెలివితేటలతో ఉద్యోగం కోసం ఇట్టే తన దగ్గరికి వచ్చే అమ్మాయిల అవసరాన్నీ, మనసునూ పసిగట్టేయగలడు.

సహజంగా ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగం కోసం వచ్చేవారు ఇంట్లోని ఆర్థిక ఇబ్బందులకు తట్టుకోలేక వస్తుంటారు.

అలాంటి వారు ఆదిత్య వలలో ఈజీగా పడిపోతారు. కారణం అతని కోర్కెతీర్చకపోతే ఉద్యోగం రాదేమోనని భయం. అప్పటికే కాళ్ళరిగేలా తిరిగిన వాళ్ళు రాజీపడిపోయి అతనికి లొంగిపోతుంటారు.

కానీ, విజయలక్ష్మి అలాంటి ఆడపిల్ల కాదు అతనన్న మాటలకు అతని చెంప పగలగొట్టాలనిపించినా అలా చేయలేకపోవటానికి కారణం ఆమె పరిస్థితి.

అలాగని రాజీపడి తన శీలాన్ని అర్పించటానికి సిద్ధంగా లేదామె.

ఉదయం నుండి ఏమీ తినకపోవడంవల్ల, ఈ ఉద్యోగం కూడా చేజారిపోయిందేనన్న బాధవల్ల విపరీతమైన నీరసం శరీరాన్ని ఆవహించడంతో కళ్ళు తిరిగి పడిపోతుందేమో! అన్నట్లుగా ఉంది ఆమె పరిస్థితి!

అంత నీరసంలోనూ ఆమె పెదవులపై సన్నని నవ్వు ప్రత్యక్షమైంది.

అందుకు కారణం తన తల్లిదండ్రులు తనకుపెట్టిన పేరు. తన పేరులోని విజయలక్ష్మిలో లక్ష్మి పుట్టిన దగ్గర నుండి లేకపోగా విజయం కూడా సాధించలేక పోతున్నాననే బాధ.

ఆఫీసు నుండి ఎలా బయటపడిందో తెలీదు ఆమెకి. ఇక తనకి ఉద్యోగం రావడం జన్మలో జరిగే పనికాదు. ఎన్ని ఇంటర్వ్యూలకు వెళ్ళినా వారి నుండి వచ్చే సమాధానం డబ్బు. లంచంలేనిదే ఉద్యోగం రావడం అసంభవం. ఆమె ఆలోచనల మాదిరిగా గజిబిజిగా పడుతున్నాయి అడుగులు.

"హలో! విజయగారూ! బావున్నారా!!" తనకు పరిచయమైన కంఠంలా అనిపించడంతో పక్కకు తిరిగి చూసింది విజయ.

వివేక్ కాలేజ్‌లో తనతో బి.కాం. వరకు చదివాడు. కాలేజీ జీవితానికి గుర్తుగా తనకున్న ఒకే ఒక బెస్ట్‌ఫ్రెండ్



## పాపం నిర్మాత!

అక్షయ్ కుమార్ - రవీనా టాండన్‌ల మధ్య ప్రేమాయణం సాగుతోందనేది గత కొంతకాలంగా వినిపిస్తున్నదే. అయితే ఈ విషయంలో ఇద్దరి స్టేట్‌మెంట్లు కూడా 'వి' చిత్రంగానే ఉన్నాయి. అదలాఉంచితే - ఇలీవల 'కీమత్' అనే చిత్రంకోసం కొన్ని 'పాచ్‌వర్క్ షాట్లు చేయాల్సివస్తే 'వేరేచిత్రం డబ్బింగ్‌కి ఒప్పుకున్నాను. కాబట్టి ఇప్పుడు కుదరదు' అని చెప్పి ఎగ్గొట్టాట్ట అక్షయ్. ఆ తర్వాత ఆ నిర్మాత ఆరాతీస్తే డబ్బింగూ లేదు గిబ్బింగూ లేదు - రవీనాతో కబుర్లు చెప్పుకోవడమేనట.

-మౌర్య

వివేక్.

స్టడీలో అతను పూర్. చదువు మినహా మిగతా అన్ని విషయాల్లో చాలా చురుగ్గా ఉండేవాడు. తనతో మాట్లాడుతున్నపుడు తనలైఫ్‌లో సాధించాల్సిన వాటి గురించి, తన ఆశయాల గురించి చెప్తుండేవాడు.

వివేక్ ఆమెకు దగ్గరగా వచ్చి నీరసంగా ఉన్న విజయను చూస్తూ "ఏమిటండీ హెల్త్ బాగాలేదా?!" అన్నాడు.

'లేదే! అయామ్ ఫైన్.' బలవంతపు నవ్వొకదాన్ని మొహంలోకి తెచ్చుకుంటూ "అవును మీరిప్పుడేం చేస్తున్నారు." అడిగింది.

'అలా వెళ్తూ మాట్లాడుకుందాంరండి' అంటూ ఆమెను తన కారులో ఎక్కించుకొని డ్రైవ్ చేస్తుండగా మళ్ళీ అడిగింది విజయలక్ష్మి.

"మీకు తెలీందేముందండీ. చదువులో నేను పూర్- డిగ్రీ పూర్తికాలేదు ఇక దానిజోలికెళ్ళటం ఎందుకులే అని బిజినెస్ చూసుకుంటున్నాను. ఇప్పుడు చెప్పండి మీరేంచేస్తున్నారు." అడిగాడు వివేక్.

"మాదే ముందండీ. పావర్టీ లైన్‌కు దిగువన ఉన్న వాళ్ళం. ఎప్పుడూ ఏదో ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతూంటాం. డిగ్రీ అయ్యాక టైప్‌లోయర్, హయ్యర్ పూర్తి చేశాను. ఆ తర్వాత ఏదైనా జాబ్ దొరుకుతుందేమోనని ఆఫీసుల చుట్టూ పట్టువదలని విక్రమార్కుని కజిన్‌లా తిరుగుతున్నాను. ఇప్పుడే ఒక ఇంటర్వ్యూకి వెళ్ళి వస్తూ ఉన్నాను. మీరు కనిపించారు" చెప్పింది విజయ.

"ఈ జాబ్ అయినా వస్తుందని నమ్మకముందా మీకు?" ఒక హోటల్ ముందు కారు ఆపుతూ అడిగాడు.

లేదు. ఇదేకాదు వాళ్ళడిగిన లంచం ఇవ్వనంతకాలం నాకు జాబ్‌రాదని నిర్ధారించుకున్నాను."

"రండి అలా టిఫిన్ చేస్తూ మాట్లాడుకుందాం" కారులో నుండి దిగి డోర్‌లాక్ చేస్తూ అన్నాడు వివేక్.

"లేదు వివేక్ నేను అర్జంటుగా ఇంటికెళ్ళాలి" అని అనలేదామె. కామ్‌గా అతన్ని అనుసరించింది.

ఇద్దరూ వెళ్ళి ఒక టేబుల్ ముందు ఖాళీగా ఉన్న రెండు కుర్చీల్లో కూర్చున్నారు.

టిఫిన్‌కు ఆర్డరిచ్చిన తర్వాత విజయ వైపు తిరిగి అడిగాడు వివేక్ అయితే మీకు జాబ్ వచ్చే అవకాశాలు ఏమాత్రం లేవంటారు."

అవునన్నట్లుగా తలూపింది విజయ. వెంటనే అన్నాడు వివేక్ మీరేమీ అనుకోనంటే ఓ మాట అడుగుతాను

"అడగండి" జగ్‌లోని ఐస్ వాటర్‌ను గ్లాసులోకి వంపుకుంటూ అంది.

"ఈ భూమ్మీద ఉన్న జీవరాశి అన్నింటిలోనూ మానవునికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది కదా! ఎందుకంటారు?"

"మానవునికి ఉన్నంత మేధస్సు మరే జీవికి లేదు కాబట్టి" తడుము కోకుండా చెప్పింది విజయలక్ష్మి.

"అవును కదా! మరి అంతగొప్ప మేధస్సున్న మానవుడు తను బ్రతకడానికి అవసరమైన ఒక చిన్న ఉద్యోగాన్ని సంపాదించుకోలేకపోవడం ఎంత సిగ్గుచేటు. మీరిందాక అన్నారు. వాళ్ళడిగిన లంచం ఇవ్వనంత కాలం మీకు జాబ్‌రాదని. నేనంటాను లంచం ఇచ్చి ఉద్యోగం సంపాదించుకోవడం గొప్ప విషయంకాదని. లంచం ఇవ్వకుండా సంపాదించగల శక్తి మీకుంది. కాని మీ ఆర్థిక పరిస్థితుల వల్ల, ఆఫీసుల చుట్టూ అదే పనిగా ఇంటర్వ్యూలకి తిరగడంవలన మీలో నిరాశా, నిస్పృహలు చోటు చేసుకున్నాయి.అందుకే మీరలా మాట్లాడుతున్నారు" అన్నాడు వివేక్.

"మీరనేదేమిటో నాకర్థం కావటం లేదు?"

"విజయ గారూ! మీరూ నేనూ మూడేళ్ళు కలిసి చదువుకున్నాం. మీరేమిటో మీ మేధస్సేమిటో పూర్తిగా తెలుసు నాకు. నేను చదువులో పూరే కావొచ్చు కానీ ఎదుటి మనిషిని అంచనావేయడంలో చాలా పర్‌ఫెక్ట్‌గా ఉంటాను.

ఈ లోకంలో మనిషి తల్చుకుంటే చేయలేనిదేదీ లేదని గట్టిగా నమ్మేవాడిని నేను. నాకున్న డబ్బుతో మీకు ఉద్యోగం ఇప్పించడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ అది నా సిద్ధాంతానికి విరుద్ధం.

కాలేజ్‌లో క్విజ్ పోటీల దగ్గర నుండి ఫైనల్ ఎగ్జామ్ దాకా సెంట్ పర్సెంట్ మార్కులు తెచ్చుకున్న మీరు ఇలా నిరాశా, నిస్పృహలతో గడపడం నాకిష్టంలేదు.

డబ్బిచ్చి పరీక్ష పాసయి అదే పద్ధతిలో మంచి ఉద్యోగం సైతం సంపాదించి మీ ముందే ఎంతో మంది ఎదిగిపోతూంటే, ఎంతో గొప్ప మేధస్సున్న మీరు మాత్రం ఇంకా దిగజారి పోవడం నేను భరించలేను.

ఓ నెల్రోజుల్లో మీరు ఉద్యోగం సంపాదించుకోలేని పక్షంలో మీకు ఉద్యోగం నేనిప్పిస్తాను. అదీ జాలిపడో, నాఫ్రెండ్‌వనో కాదు .ఒక తెలివైన వ్యక్తికి సైతం ఉద్యోగమివ్వటానికి లంచం అడుగు తున్న ఈ లంచాలలోకపు వికృత రూపం చూసి.'

ఇద్దరూ టిఫిన్ చేస్తున్నారనే గానీ వాళ్ళు వేరే లోకంలో కెళ్ళి సుదీర్ఘమైన చర్చలు జరుపుతున్నారు.

మళ్ళీ వివేక్ అన్నాడు.

"చివరిగా ఒక్కమాట విజయ గారూ! వజ్రానికి సైతం సానబెడితేనే దాని విలువ పెరిగేది.


మీ భయాల్నీ, సమస్యల్నీ ఒకసారి ప్రక్కకునెట్టి మీ మెదడుకు పదును పెట్టండి.

నెల రోజుల్లో ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో ముందుకు సాగండి. విష్ యూ బెస్టాఫ్ లక్" టిఫిన్ తినడం పూర్తిచేసి బిల్లు తాలూకు డబ్బు పేచేసి లేచాడు వివేక్.

అప్పటి వరకు ట్రాన్స్‌లో ఉన్న దానిలా అతని మాటల్ని విన్న విజయ తేరుకుని ఒక్కసారిగా లేచి అతని వెంట నడచింది. కారుని ఆమె ఉండే వీధి మొదట్లొ ఆపమని చెప్పి దిగింది విజయ.

హోటల్ నుండి బయలుదేరిన తర్వాత మధ్యలో వాళ్ళిద్దరూ ఒక్కమాట కూడా మాట్లాడు కోలేదు.

"థాంక్స్ ఫర్ యువర్ కో ఆపరేషన్" ఉంటాను.




డి.శ్రీధర్, కొండాపురం, మం॥రాయదుర్గ, జిల్లా॥అనంతపూర్

మెరిసే కళ్ళతో అంది విజయలక్ష్మి.

ఇందాక రోడుమ్మీద ఆమెను చూసిన స్థితిని. ఇప్పటి ఆమెలోని ఉత్సాహాన్ని చూసి ఆశ్చర్యపోతూ "వెల్‌కమ్" అంటూ తన అడ్రస్ కార్డును ఆమె చేతిలో పెట్టి కారును స్టార్ట్ చేశాడు.

★ ★ ★

ఆ రాత్రి భోంచేసి పడుకుందనే గాని విజయలక్ష్మికి నిద్రరావడంలేదు.

వివేక్ మాటలు ఆమెలో ఏ మూలో ఉన్న నమ్మకాన్ని వెలికి తీస్తున్నాయి. ఆమె ఇరవై రెండేళ్ళ చరిత్రలో ఇంతవరకూ ఎన్నడూ ఆలోచించని విధంగా ఆలోచిస్తోంది.

"ప్రతిభకంటే, పైసలకే ప్రాధాన్యతనిచ్చే ఈ ప్రపంచంలో ఇంకా నీతిగా, నిజాయితీగా తనకు ఉద్యోగం ఇచ్చే వాళ్ళు ఉన్నారనుకోవడం తన భ్రమే అవుతుంది.

అవును వివేక్ చెప్పింది నిజమే. అదే పనిగా ఇంటర్వ్యూలకు తిరగడంవలన, ఆర్థిక ఇబ్బందులవల్ల, ఉద్యోగం తనకు వస్తుందోరాదోనన్న టెన్షన్ వల్ల తన మెదడు వేరే కోణంలో నుండి ఆలోచించే కెపాసిటీని కోల్పోయింది. ఇకముందు అలా జరగడానికి వీల్లేదు. సంపాదించాలి! ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలి!"

ఆమె ఆలోచనలు ఒక రూపం దాల్చినట్లుగా సన్నని నవ్వు పెదవులపై ప్రత్యక్షమౌతుండగా అనుకుంది.

"యస్! ముల్లును ముల్లుతోనే తీయాలి".

'ఎష్ యూ బెస్టాఫ్ లక్' అన్నట్లు నిండుగా నవ్వుతున్నాడు ఆకాశంలోని చంద్రుడు.

★ ★ ★

మర్నాడు ఉదయం సీట్‌గా ముస్తాబై పెంకుటింటిలో నుండి బయటపడి నిన్న ఇంటర్వ్యూ కెళ్ళొచ్చిన ఆఫీసుకు బయలుదేరింది విజయ.

తొమ్మిదిన్నరకే ఆఫీసుకు చేరుకుని గేటు తీసుకుని లోపలికి వెళ్ళబోతుంటే ఎదురుగా ప్యూను "ఆఫీసు తెరిచేది పది గంటలకు మేడం ఒక అరగంట..." అని ఇంకా ఏదో అనబోతున్న అతని మాటలని మధ్యలోనే ఆపుతూ

"నాకు మీ ఎమ్.డి.గారి ఇంటి అడ్రస్ కావాలి" అంటూ తన పర్సులో ఉన్న రెండు ఐదు నోట్లలో నుండి ఒకటి తీసి అతని కందించింది.

ప్రొద్దున్నే అనుకోకుండా వస్తోన్న అదృష్టానికి మురిసిపోతూ చటుక్కున ఆ ఐదు అందుకుని జేబులోకి తోసుకుని పాఠం అప్ప జెప్పినట్లుగా మేనేజర్ ఇంటి అడ్రస్ చెప్పాడు ప్యూను.

సరిగ్గా పదింబావుకి ఎమ్.డి.ఆదిత్య ఇంటి ముందు రిక్షాలో దిగి రిక్షావాడికి డబ్బిచ్చి ముందుకు కదిలింది విజయలక్ష్మి. మూడోసారి కాలింగ్‌బెల్ నొక్కబోతూంటే తలుపు తెరుచుకుంది.

ఎదురుగా ఆదిత్య భార్య అయి ఉంటుంది. పాతికేళ్ళ వయసుంటుంది. అయినా పసితనపు ఛాయలేవీ తగ్గలేదు ఆమెలో.

ముట్టుకుంటే కందిపోయేలా ఉన్న తెల్లటి వళ్ళు. అమాయకత్వం పలికించే కళ్ళు. లేత ముఖం, లేలేత పెదాలు, చూడగానే 'ఇరవైలోపే ఉంటుంది వయసు' అనిపించేలా ఉంది.

"ఎవరండీ మీరు? ఎవరు కావాలి?" చక్రాల్లాంటి కళ్ళను టపటపలాడిస్తూ అంది ఆదిత్య భార్య.

"మీరే కావాలి" ముక్తసరిగా జవాబిచ్చింది విజయ.

"నేను మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదే!! మీరు..." కనుబొమ్మలు ముడివేస్తూ దీర్ఘం తీసింది.

"నేను మీవారు పనిచేసే కంపెనీలో కొత్తగా జాయినవబోతున్నాను. మీతో కొంచెం మాట్లాడాలి. అలా లోపలికి వెళ్ళి మాట్లాడు కుందామా" అని చొరవగా లోపలకి వెళ్ళింది విజయ.

"నాతో మా...ట్లా...డే...దే..మి...టి" బెరుకుదనం ఆమె కళ్ళల్లోనే కాక మాటల్లోకూడా స్పష్టంగా కనిపించింది.

లోపలికొచ్చి ఇల్లంతా కలయజూస్తూ "ఊఁ బాగానే కట్టించారు. నాక్కూడా త్వరలో ఇలాంటి ఇల్లేకట్టించమని అడగాలి మీవారిని" అంది విజయ.

ఆ మాటలను విన్న ఆదిత్య భార్యకు ఆశ్చర్యం, కోపం ముంచుకొచ్చాయి.

"ఇల్లు కట్టించమని మావార్ని అడగడానికి మీరు ఆయనకేమైనా కావలసిన వాళ్ళా? లేక ఆయనేమైనా దాన కర్ణుడనుకుంటున్నారా!!"

ఆదిత్య భార్య మాటలకు దగ్గరగా వచ్చి అంది విజయ. "ఆ రెండూ కాకపోయినా మీ వారికి కాబోయే సెకండ్ ఫ్యామిలీగా అలా అడిగే అధికారం లేదంటారా?"

ఆ మాటలతో స్తన్నయిపోయింది ఆదిత్య భార్య.

అర నిముషం తర్వాత తేరుకుని "మీరంటున్నదేమిటో నాకర్థం కావటంలేదు. దయచేసి అర్థమయ్యేలా చెప్పండి" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అంది.

ఆమె కళ్ళల్లో కదలాడే కన్నీటిని చూసి చలించిపోయింది విజయ.

అంతలోనే తను ఎందుకు వచ్చిందో గుర్తుచేసుకుని నిగ్రహించుకుని "నిన్న మీవారి కంపెనీలో టైపిస్టుగా చేరటానికి ఇంటర్వ్యూకెళ్ళాను. ఆ జాబ్ నాకు రావాలంటే ఇరవై వేల లంచంగానీ, ఒక రాత్రి మీవారితో గడిపితేనైనా కానీ వస్తుందని మీవారు ఖచ్చితంగా చెప్పారు.

ఇరవై వేలు కాదు గదా ఇరవై వందలు కూడా లేవు నాదగ్గర. మరి ఆ జాబ్ రావాలంటే మీవారి రెండోకండీషన్‌కి ఒప్పుకోక తప్పదు కదా! అందుకే నేను..." ఇంకా చెప్పబోతున్న విజయ మాటలను మధ్యలోనే ఆపి ఆమె చేతులు పట్టుకుని "దయచేసి నా కాపురంలో నిప్పులు పొయ్యకండి... పిల్లలు గలదాన్ని. మీ ఉద్యోగానికి కావలసిన ఇరవైవేలు నేనిస్తాను సాటి ఆడదానిగా మిమ్మల్ని అర్థిస్తున్నాను. ప్లీజ్!!" అంది ఏడుపు స్వరంతో.

"నాకు ఉద్యోగం కోసం శీలాన్ని పణంగా పెట్టడం ఇష్టంలేదు కాని ఇరవైవేలంటే మాటలా? అందుకే.."


విజయ మాటలు పూర్తిగా వినకుండానే లోపలికి పరుగెత్తు కెళ్ళి వందరూపాయల కట్టలు రెండు తెచ్చి విజయ చేతిలోపెట్టి.

"ఈ డబ్బుతో ఉద్యోగంలోచేరండి. ఈ డబ్బు మీకిచ్చినట్లు మావారితో చెప్పకండి" అంది ఆదిత్య భార్య.

ఆ డబ్బు నందుకుని మొట్ట మొదటిసారిగా విజయ కేతనాన్ని ఎగురవేసిన దానిలా విజయదరహాసంతో ముందుకి కదిలింది విజయ.

-వి.శ్రీనివాస చార్యులు
సన్నాఫ్: వి.ఎస్.ఎన్.చార్యులు
పెదకొడమ గుండ్ల(పోస్ట్)
కారంపూడి (మం)
జిల్లా- గుంటూరు-522 614.

★




వి.బాబాజి, కార్టూనిస్ట్, కురబాలకోట-517350, జిల్లా-చిత్తూరు